క్లుప్తంగా

ఏయూకు పుస్తకాల బహూకరణ



పుస్తకాలు బహూకరిస్తున్న ఉషా శ్రీదేవి తదితరులు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం గ్రంథాలయానికి ఆస్ట్రేలియా తొలితరం రచయిత, విశ్రాంత మైనింగ్ ఇంజినీర్ వి.ఎస్.ఊటుకూరి రచించిన తెలుగు పాటలకు సంబంధించిన పరిశోధనాత్మక పుస్తకాలను ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఎన్.కిషోర్‌బాబుకు అందించారు. గురువారం రిజిస్ట్రార్‌ను కార్యాలయంలో శ్రీధర్ కరుణాకర్, ఆస్ట్రేలియా వర్సిటీ గణిత అధ్యాపకురాలు ప్రవాస రచయిత్రి ఉషా శ్రీ దేవి, ఏయూ తెలుగు ఆచార్యులు అయ్యగారి సీతారత్నం కలిసి ఈ పుస్తకాలను బహూకరించారు. తెలుగు సినిమా పాటలకు సంబంధించి సంగీత దర్శకులు, గీత రచయితలు, గాయకులు వంటి వివరాలతో సమగ్రంగా తీర్చిదిద్దిన ఈ పుస్తకాలతో పాటు, డిజిటల్ కాపీలను సైతం అందించారు. ఇటువంటి అపురూపమైన పుస్తకాలు బహూకరించిన వారిని రిజిస్ట్రార్ అభినందించారు.

వంగవీటికి ఘన నివాళి



వంగవీటి విగ్రహానికి పూలమాల వేస్తున్న కాపు సామాజిక వర్గం నాయకులు

ఆరిలోవ: వంగవీటి మోహన రంగా జయంతిని గురువారం ఆరిలోవ ప్రాంతంలో ఘనంగా నిర్వహించారు. ఆదర్శనగర్, హనుమంతవాకతో పాటు అడవివరం, పైనాపిల్ కాలనీ తదితర ప్రాంతాల ప్రజలు రంగా విగ్రహానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. ఆదర్శనగర్‌కు చెందిన ఉమ్మడి రాష్ట్రం మాజీ పీసీసీ కార్యదర్శి మీసాల వెకటరాయుడు(రామలక్ష్మణ్), మీసాల లక్ష్మయ్య, బసవ రాంబాబు, పెద కాపు, పతివాడ కనకరాజు, మోది అప్పారావు, నాయుడు, చోడిగిందె అప్పలనాయుడు తదితరులు అడవివరం ప్రాంతంలో రంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

జీతాలు చెల్లించాలంటూ ఆందోళన



స్టీల్‌ప్లాంట్ ఆస్పత్రి వద్ద ధర్నా చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు

ఉక్కునగరం: ఉక్కు జనరల్ ఆస్పత్రి కాంట్రాక్ట్ కార్మికులకు జీతాలు వెంటనే చెల్లించాలని సీఐటీయూ కాంట్రాక్ట్ లేబర్ యూనియన్ ఉపాధ్యక్షుడు వీవీ రమణ డిమాండ్ చేశారు. ఈ అంశంపై గురువారం యూనియన్ ఆధ్వర్యంలో ఆస్పత్రి ముందు ధర్నా చేశారు. ధర్నాలో ఆయన మాట్లాడుతూ ఆస్పత్రిలో 86 మంది కాంట్రాక్ట్ కార్మికులు విధులు నిర్వహిస్తున్నారన్నారు. వారికి ఈ ఏడాది ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్ నెలల జీతాలు చెల్లించలేదన్నారు. దీంతో వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రిన్సిపుల్ ఎంప్లాయర్‌గా యాజమాన్యమే వారికి జీతాలు చెల్లించాలన్నారు. కార్యక్రమంలో బొట్ట గంగరాజు, సోమేష్, మల్లు సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

రేబిస్ టీకాల శిబిరం రేపు

విశాఖ విద్య: ప్రపంచ జూనోసిస్ డే సందర్భంగా ఈ నెల 6న గోపాలపట్నం ప్రాంతీయ పశు వైద్యశాలలో ఉచితంగా రేబిస్ టీకాలు వేస్తామని ఆస్పత్రి వైద్యుడు ఎ.రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. 89, 90, 91, 92 వార్డుల్లోని పెంపుడు కుక్కలను శనివారం ఆస్పత్రికి తీసుకురావాలని సూచించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

స్క్రాప్‌తో పాట్లు

- నివాసాల మధ్య యథేచ్ఛగా స్క్రాప్ షాపుల నిర్వహణ
- దుర్గంధం, దోమలతో ప్రజలకు తప్పని అవస్థలు



సుందరయ్య కాలనీలో నివాసాల మధ్య స్క్రాప్ షాపులు



ఆరిలోవ: నివాసాల మధ్య స్క్రాప్ షాపుల నిర్వహణతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. ఆరిలోవ ప్రాంతంలో విచ్చలవిడిగా తుక్కు(స్క్రాబ్) నిల్వలు పెరిగిపోతున్నాయి. జీవీఎంసీ 12వ వార్డు పరిధి సుందరయ్యకాలనీ, శ్రీకాంత్‌నగర్, చినగదిలి, పార్వతీనగర్, 13వ వార్డులో ఆరిలోవ కాలనీలో తుక్కు దుకాణాలు నివాసాల మధ్య నిర్వహిస్తున్నారు. తుప్పు పట్టిన బీరువాలు, ఫ్రిజ్‌లు, వాషింగ్ మెషిన్లు, ఖాళీ ప్లాస్టిక్ సీసాలు, ప్లాస్టిక్ సంచులు, పేపర్లు, అట్టలు, ఇనుప ఊచలు, విరిగిన కుర్చీలు, పనికిరాని ఎలక్ట్రికల్ వస్తువులు.. ఇలా స్క్రాప్ దుకాణాల్లో నిల్వలు పేరుకుపోతున్నాయి. దీంతో వాటి నుంచి దుర్వాసన భరించలేనంతగా ఉంది. మరోవైపు ధూళితో పాటు వర్షం నీరు తుక్కు నిల్వల్లో చేరి నిలిచిపోతోంది. ఇది దోమల వృద్ధికి దోహదపడుతోంది. రాత్రి వేళ ఆయా ప్రాంతాల ప్రజలకు దోమలు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. వర్షా కాలం కావడంతో దోమ కాటుకు గురై జ్వరాల బారిన పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జీవీఎంసీ వైద్య, ఆరోగ్య విభాగం అధికారులు పట్టించుకోకపోవడంతో విచ్చలవిడిగా తుక్కు వాపారాలు పెరిగిపోతున్నాయని ఆరోపిస్తున్నారు. ఈ వ్యాపారం నివాసాల మధ్య కాకుండా దూరంగా ఖాళీ స్థలాల్లో నిర్వహించుకుంటే బాగుంటుందని స్థానికులు సూచిస్తున్నారు. మరోవైపు తుక్కు కారణంగా ఎప్పుడు ఎలాంటి ప్రమాదాలు జరుగుతాయోనని ఆందోళన చెందుతున్నారు. గతేడాది శ్రీకాంత్‌నగర్‌లో ఓ స్క్రాప్ షాపులో రేగిన మంటలు, పరవాడ ప్రాంతంలో ఓ తుక్కు దుకాణంలో జరిగిన అగ్ని ప్రమాదాన్ని గుర్తు చేసుకుని ఆయా ప్రాంతాల ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. గురువారం ఇళ్ల వద్ద కుండీలలో దోమల నివారణ మందు వేయడానికి వెళ్లిన మలేరియా విభాగం సిబ్బందిని సుందరయ్య కాలనీ వాసులు అక్కడ నివాసాల మధ్య ఉన్న తుక్కు నిల్వలపై నిలదీశారు. అధికారులకు చెప్పి తొలగించాలని కోరారు.

- సుందరయ్య కాలనీలో ఓ వ్యాపారి లీజుకు తీసుకున్న రెండు స్థలాలతో పాటు పక్కనే ఖాళీగా ఉన్న రెవెన్యూ స్థలాన్ని సైతం అనధికారంగా తుక్కు నిల్వల కోసం వినియోగించుకుంటున్నాడు. ఆయా స్థలాల్లో టన్నుల కొద్దీ స్క్రాప్ మూటలు నిల్వ చేశారు. ఇతర ప్రాంతాల నుంచి తుక్కును తీసుకొచ్చినప్పుడు, దుకాణం నుంచి తుక్కును వేరే చోటకు తరలించినప్పుడు వ్యాన్లతో హడావిడి చేస్తుంటారు. ఇక్కడ చిన్న రోడ్డు కావడంతో నివాసాల మధ్య రాత్రి పగలు వాహనాల రాకపోకలతో స్థానికులు ఇబ్బంది పెడుతున్నారు. శ్రీకాంత్‌నగర్‌లో రెండు చోట్ల తుక్కు దుకాణాలు నివాసాల మధ్యనే ఉన్నాయి. వీటిలో మూడేళ్ల క్రితం ఓ దుకాణంలో అగ్ని ప్రమాదం జరిగింది. పార్వతీనగర్‌లో ప్రధాన రహదారి పక్కన నిర్వహిస్తున్న తుక్కు దుకాణంలో ప్లాస్టిక్ వ్యర్థాలు, మూటలు రోడ్డు మీదే నిల్వ చేస్తున్నారు. వ్యాన్లలో తుక్కును తరలించేటప్పుడు ఆ దారిన వెళ్లే వాహనచోదకులకు ట్రాఫిక్ సమస్య ఎదురవుతోంది. చినగదిలిలో ఓ వ్యక్తి ఫుట్‌పాత్‌నే తుక్కు వ్యాపారానికి అనువుగా చేసుకున్నాడు. కొన్నేళ్లుగా ఈ వ్యాపారం జీవీఎంసీ జోన్–2 ఏఎంహెచ్‌వో కనుసన్నల్లోనే జరుగుతోందని పలువురు విమర్శిస్తున్నారు. ఏఎంహెచ్‌వోకి ఎన్ని సార్లు వీటిపై ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని చెబుతున్నారు.

దోమలు పెరిగిపోతున్నాయి..

తుక్కు నిల్వలు ఇళ్ల మధ్యలోనే ఉన్నాయి. వీటి వల్ల దోమలు పెరిగిపోతున్నాయి. సుందరయ్య కాలనీలో చిన్న రోడ్డు పక్కనే మూడు స్థలాల్లో తుక్కు మూటలు కుప్పలుగా వేసి నిల్వ చేశారు. వర్షాకాలం కావడంతో పెరుగుతున్న దోమలు నిద్ర లేకుండా చేస్తున్నాయి. దోమ కాటుతో జ్వరాలు వస్తున్నాయి. శానిటరీ అధికారులకు చెప్పినా ఫలితం ఉండడం లేదు. వాటిని నివాసాలకు దూరంగా తరలించాలి.

– ఎం.రాజేశ్వరరావు, సుందరయ్య కాలనీ

దుర్వాసన కూడా వస్తుంది..

తుక్కు దుకాణం నుంచి దుర్వాసనతో పాటు దోమలు పెరిగిపోతున్నాయి. వర్షాలు పడినప్పుడు అవి తడిసిపోయి దుర్వాసన వస్తుంది. నిల్వ ఉన్న డబ్బాల్లో వర్షపు నీరు నిలిచిపోతోంది. తుక్కును వ్యాన్లలో తరలించినప్పుడు రోడ్డుపై వెళ్లడానికి ఇబ్బందిపడుతున్నాం. అధికారులు స్క్రాప్ షాపులపై చర్యలు తీసుకోవాలి.

– ఎస్.రామారావు, శ్రీకాంత్‌నగర్

యువతకు స్ఫూర్తి అల్లూరి జీవితం



అల్లూరి విగ్రహానికి పూలమాల వేస్తున్న రిజిస్ట్రార్ కిషోర్ బాబు, తదితరులు



అల్లూరి సీతారామరాజు చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న కృష్ణా కళాశాల అధ్యాపకులు



అల్లూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి, తదితరులు



డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో నివాళులర్పిస్తున్న యువత

ఏయూ క్యాంపస్: యువతకు స్ఫూర్తిగా అల్లూరి జీవితం నిలుస్తుందని ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఎన్.కిషోర్‌బాబు అన్నారు. గురువారం ఉదయం అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా ఏయూ న్యాయ కళాశాల వద్ద ఉన్న అల్లూరి విగ్రహానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాళ్లు ఆచార్య ఎ.నరసింహారావు, ఆచార్య ఎం.వి.ఆర్. రాజు, ఆచార్య కె.సీతామాణిక్యం, ఆచార్య పద్మశ్రీ, లైబ్రేరియన్ ఆచార్య పి.వెంకటేశ్వర్లు, న్యాయ కళాశాల ఆచార్యులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

కృష్ణా కళాశాలలో..

మద్దిలపాలెం : మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలను మద్దిలపాలెం డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం ఘనంగా నిర్వహించారు. అల్లూరి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.జయ, అధ్యాపకులు పాల్గొన్నారు.

కృష్ణా జూనియర్ కళాశాలలో..

మద్దిలపాలెం : అల్లూరి సీతారామరాజు చిత్ర పటానికి డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కృష్ణారావు, ఎన్‌సీసీ అధికారి బి.సన్యాసిరావు పూలమాలలు వేసి అంజలి ఘటించారు. ఈ సందర్భంగా అల్లూరి జీవిత విశేషాలను గుర్తు చేసుకున్నారు.

ఎంవీపీ కాలనీ: మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజుకు ఎంవీపీ కాలనీ సెక్టార్–3, ఎంవీపీ కాలనీ క్షత్రియ సంఘం ఆధ్వర్యంలో ఘన నివాళులర్పించారు. ఎంవీపీ కాలనీ సెక్టార్–3 పార్కులోని ఆయన విగ్రహానికి ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, తదితరులు పూలమాల వేసి అంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకుడు చోడే వెంకట పట్టాభిరామ్, 18వ వార్డు కార్పొరేటర్ గొలగాని మంగవేణి, ఆయా సంఘాల నాయకులు పాత్రుడు, సూర్యప్రకాష్, రామచంద్రరాజు, నాగేశ్వరరావు, నెక్కింటి సత్తిబాబు, వైఆర్ఎస్ఎస్ కుమార్, పూసపాటి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

- భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య(డీవైఎఫ్ఐ) ఆధ్వర్యంలో ఎంవీపీ కాలనీలో అల్లూరి సీతారామరాజు జయంతితో పాటు స్వామి వివేకానందుడి వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంస్థ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజు, డాక్టర్ ప్రియాంక, జిల్లా నాయకుడు ప్రసాద్, సేవ్ ది సోయిల్ నాయకుడు సుబ్రహ్మణ్య శర్మ, పలువురు నాయకులు పాల్గొన్నారు.

కొత్త కలెక్టర్‌కు అభినందనలు



కలెక్టర్ హరేందిర ప్రసాద్‌ను అభినందిస్తున్న సెంట్రల్ జైలు సూపరింటెండెంట్ కిషోర్ కుమార్, అదనపు సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు



జిల్లా కలెక్టర్‌ను అభినందిస్తున్న వీఎంఆర్‌డీఏ కార్యదర్శి దాట్ల కీర్తి

మహారాణిపేట : జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్‌ను గురువారం సెంట్రల్ జైలు సూపరింటెండెంట్ కిషోర్ కుమార్, అదనపు సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు మర్యాద పూర్వకంగా కలిశారు. కలెక్టరేట్‌లో ఉన్న కలెక్టర్ చాంబర్‌లో ఆయనను కలిసి పుష్పగుచ్ఛంతో అభినందనలు తెలిపారు.

- జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్‌ను గురువారం వీఎంఆర్‌డీఏ కార్యదర్శి దాట్ల కీర్తి మర్యాద పూర్వకంగా కలిశారు. కలెక్టర్‌ను పుష్పగుచ్ఛంతో అభినందించారు.

కమనీయం శ్రీకృష్ణ లీలలు నాటకం



శ్రీకృష్ణ లీలలు నాటకంలో సన్నివేశాలు

మద్దిలపాలెం : సురభి శ్రీకృష్ణ లీలలు నాటకం ప్రతి సన్నివేశం ఎంతో అద్భుతంగా సాగింది. మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో ఐదో రోజు శ్రీకృష్ణలీలలు నాటకాన్ని ప్రదర్శించారు. కథానుగుణంగా పాత్రదారులు వారి నటనతో అందరి అలరించారు. సన్నివేశాలకు తగ్గట్టుగా పద్యాలు ఆలాపించి అకట్టుకున్నారు.అద్యంతం నాటకం కమనీయంగా సాగింది. ఈ కార్యక్రమానికి విశ్రాంత లేబర్ కమిషనర్ డీఆర్‌కే రావు, హైకోర్టు న్యాయవాది కేఆర్ రావు, బడే ప్రభాకర్ తదితరులు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. రంగసాయి నాటక సంఘం వ్యవస్థాపకుడు బాదం గిర్ సాయి నేతృత్వంలో ప్రదర్శించారు. నాటకం సినిమాను తలపించేలా ఉందని ప్రేక్షకులు ప్రశంసలు కురిపించారు.

విమ్స్ ఆవరణలో తుప్పలు తొలగించాలి

ఆరిలోవ: విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(విమ్స్) ఆవరణలో పెరిగిపోయిన తుప్పలను తొలగించాలని విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబును ఆరిలోవ పోలీస్ స్టేషన్ సీఐ జి.గోవిందరావు కోరారు. గురువారం ఆయన విమ్స్, పశు సంవర్ధక శాఖ స్థలాలను స్థానిక నాయకులతో కలిసి సందర్శించారు. ఆయా ఖాళీ స్థలాల్లో దట్టమైన ముళ్ల పొదలు, పిచ్చి మొక్కలు ఉండడాన్ని పరిశీలించారు. ఆ పొదలు చాటున యువకులు గంజాయి, జూదం, కోడి పందాలు తదితర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు స్థానికులు ద్వారా పోలీసులు తరుచూ ఫిర్యాదులు అందుతున్నాయి. ఆయా ఖాళీ స్థలాల్లో పనికిరాని మొక్కలు తొలగించాలని సీఐ కోరారు. విమ్స్ డైరెక్టర్ డాక్టర్ రాంబాబు, పశు సంవర్ధక శాఖ డీడీ డాక్టర్ కరుణాకరరావు స్పందించి పిచ్చి మొక్కలు తొలగించి శుభ్రం చేయిస్తామని సీఐకు హామీ ఇచ్చారు. ఈ సందర్భనలో మాజీ కార్పొరేటర్ ఒమ్మి సన్యాసిరావు, తదితరులు పాల్గొన్నారు.

సీఐలతో డీసీపీ సమీక్ష



సీఐలతో మాట్లాడుతున్న డీసీపీ సత్తిబాబు

మర్రిపాలెం: నగర పోలీస్ కమిషనర్ శంఖబత్ర బాగ్చి ఆదేశాల మేరకు గురువారం కంచరపాలెం పోలీస్ స్టేషన్‌లో జోన్–2 పరిధిలోని సీఐలతో డీసీపీ మేకా సత్తిబాబు సమీక్ష సమావేశం నిర్వహించారు. పెండింగ్ కేసులపై దృష్టి సారించాలని, వాటిని సత్వరం పరిష్కరించాలని ఆదేశించారు. పలు కేసుల దస్త్రాలను పరిశీలించి తగు సూచనలిచ్చారు.

ముఖ్యంగా గంజాయి, డ్రగ్స్ నిర్మూలన, రౌడీషీటర్లపై ఎప్పటికప్పుడు నిఘా ఉంచాలన్నారు. సమస్యాత్మక ప్రాంతాల్లో నిరంతరం గస్తీ నిర్వహించాలని సూచించారు. ఆకతాయిలు శాంతి భద్రతలకు భంగం కలిగేలా ప్రవర్తించినా, అల్లర్లు సృష్టించినా వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో సీఐలు భాస్కరరావు, చక్రధర్, తదితరులు పాల్గొన్నారు.

శివనగర్ యూపీహెచ్‌సీని సందర్శించిన డీఎంహెచ్‌వో



శివనగర్ ఆరోగ్య కేంద్రంలో సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

మహారాణిపేట: మర్రిపాలెం శివనగర్‌లోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని(యూపీహెచ్‌సీ) గురువారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి(డీఎంహెచ్‌వో) డాక్టర్ పి.జగదీశ్వరరావు సందర్శించారు. ఆరోగ్య కేంద్ర సిబ్బందికి జాతీయ ఆరోగ్య కార్యక్రమాలు, అడల్ట్ బీసీజీ వ్యాక్సిన్ కోసం పలు సూచనలిచ్చారు. అడల్ట్ బీసీజీ వ్యాక్సినేషన్‌ను పరిశీలించి, కూలర్‌ను పరీక్షించి సూచనలు చేశారు. డీఎంహెచ్‌వో సమక్షంలోనే కొంతమంది మధుమేహం, టీబీ వ్యాధిగ్రస్తులకు వ్యాక్సిన్లు వేశారు. అడల్ట్ బీసీజీ వ్యాక్సిన్ కార్యక్రమం జిల్లాలో ఏ విధంగా జరుగుతుందో పర్యవేక్షించడానికి జిల్లా ప్రొగ్రాం అధికారులు, జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ ఎస్.జీవనరాణి, జిల్లా ఎయిడ్స్ నివారణ అధికారి డాక్టర్ పూర్ణేంద్రబాబు, నోడల్ అధికారి బి.ఉమావతి, ప్రొగ్రాం అధికారి డాక్టర్ సమత వివిధ ఆరోగ్య కేంద్రాలను సందర్శించి సిబ్బందికి టీకా వేసే విధానం, వ్యాక్సిన్‌లో సిక్స్ ప్రియారిటీస్‌ను వివరించారు. లబ్ధిదారులకు వ్యాక్సినేషన్‌పై ఆరోగ్య సిబ్బందికి అవగాహన కల్పించారు. యూపీహెచ్‌సీ, పీహెచ్‌సీల్లో సాధారణ ప్రసవాలు జరిగేలా చూడాలని, సీ–సెక్షన్ ప్రసవాలను నివారించాలని డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు అన్నారు. ఆరోగ్య సిబ్బంది అందరు సమయపాలన పాటించాలని, ముఖ్యంగా స్టాప్ డయేరియా కార్యక్రమం మీద ప్రజలందరికీ అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని, వర్షా కాలంలో కీటక జనిత వ్యాధులు రాకుండా చూసుకోవాలని చెప్పారు. జిల్లా ప్రొగ్రాం అధికారులు, పట్టణ ఆరోగ్య కేంద్ర వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికుల తగ్గింపు నిర్ణయాన్ని ఉపసంహరించాలి

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లో కాంట్రాక్ట్ కార్మికులను 20 శాతం తగ్గించాలనే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ లేబర్ యూనియన్ గౌరవాధ్యక్షుడు ఓ.వి. రావు డిమాండ్ చేశారు. గురువారం ఎల్ఎంఎం పార్కులో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉక్కులో ఇప్పటికే పర్మినెంట్ కార్మికులు వేలాదిమంది రిటైర్ అయినందున ఆ పనిభారం కాంట్రాక్ట్ కార్మికులపై పడుతుందన్నారు ఈ పరిస్థితుల్లో కాంట్రాక్ట్ కార్మికులను తొలగిస్తే ప్లాంట్ పరిస్థితి ఇబ్బందికరంగా ఉంటుందన్నారు. ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు కలుగ చేసుకుని కాంట్రాక్ట్ కార్మికుల తొలగింపును అడ్డుకోవాలన్నారు. కార్యక్రమంలో నమ్మి రమణ, జి. శ్రీనివాసరావు, సోమేష్, మసేను, శశిభూషన్ తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నకు ఘనంగా ఆర్జిత సేవలు



నిత్యకల్యాణంలో యజ్ఞోపవీధారణ ఘట్టాన్ని నిర్వహిస్తున్న అర్చకుడు



నిత్యకల్యాణంలో పాల్గొన్న ఉభయదాతలు

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు ఘనంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణ పుష్పార్చన సేవ నిర్వహించారు. స్వామివారి ఉత్సవ మూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆలయ కల్యాణ మండపంలో వేదికపై అధిష్టింపజేసి, విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం జరిపారు. అష్టోత్తర శత నామావళి పటిస్తూ 108 స్వర్ణ సంపెంగ పుష్పాలతో స్వామికి అర్చన చేశారు. విశేషంగా హారతులు అందజేశారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. ఆలయ ఏఈవో ఆనంద్ కుమార్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

- శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం నిత్య కల్యాణం ఘనంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై అధిష్టింపజేసి ఉదయం 9.30 గంటల నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా సాగింది. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు.

బాల్య వివాహాలపై కళాజాత

గాజువాక: బాల్య వివాహాలవల్ల కలిగే అనర్థాలను వివరిస్తూ ఏర్పాటు చేసిన కళాజాత అందర్నీ ఆకట్టుకుంది. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో 66వ వార్డు అజీమాబాద్ అంగన్వాడీ కేంద్రంవద్ద గురువారం కళాజాత నిర్వహించారు. కిశోర బాలికలు, బాలింతలు, గర్భిణులు, మహిళలకు బాల్య వివాహాలవల్ల తలెత్తే ఇబ్బందులను కళాకారులు ఆట, పాటల ద్వారా వివరించారు. బాలల హక్కులు, చట్టాలు, గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్ వంటి అంశాలతో పాటు అంగన్వాడీ కేంద్రాల్లో బాలింతలు, గర్భిణులు, చిన్నారులకు అందించే పౌష్టికాహారం తదితర అంశాలపై స్థానికులకు అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ స్రవంతి, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.